ప్రకటన

# విద్యారంగాన్ని విచ్చలవిడిగా వ్యాపారీకరణ చేయడాన్నీ దొంగచాటుగా కాషాయీకరణ చేయడాన్నీ వ్యతిరేకించండి

**మానవ** వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ 2020 జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించింది. 1986 నాటి నూతన విద్యావిధానమూ, 1992లో దాని సవరణా పూర్తి చేయలేని లక్ష్యాలను పూర్తి చేసే ధ్యేయాన్ని ఇది తలకెత్తుకుంది.

1986 నాటి నూతన విద్యా విధానం, ప్రభుత్వం క్రమేణా విద్యారంగ బాధ్యతల నుండి ఉపసంహరించుకొని, ఆ బాధ్యతను ప్రైవేటు మార్కెట్ శక్తులకు అప్పచెప్పాలని సూచించింది. అంతేగాక విద్యార్థులను మూడు అంచెల పద్ధతిలో, "ప్రావీణ్యంగలవారు", "చదువుకోగల్గిన సామర్థ్యంకలవారు", "చదువలేనివారు"గా విభజించింది. 1986 నాటి నూతన విద్యావిధానపు ఈ లక్ష్యాన్ని, ప్రాథమిక, సెకండరీ విద్యలో కొంతవరకూ, ఉన్నత విద్యలో చాలవరకు సాధించింది. ఇప్పుడు 2020 నాటి జాతీయ విద్యావిధానం ఈ ప్రైవేటీకరణ క్రమాన్ని పూర్తిచేయడానికి నిబద్ధురాలై వుంది.

సాధారణంగా ఏ విద్య ఎన్నేళ్ళు చదవాలి అనే లెక్కల్లో 2020 జాతీయ విద్యావిధానం (ఎన్.ఇ.పి) 5+3+3+4 అనే సూత్రం ప్రకారం ప్రాథమిక, సెకండరీ విద్యను కలిపేసి, 3వ ఏట నుండి 18వ ఏట వరకు సాగే పద్ధతిలో రూపొందించింది. దీని నిండా ఉన్నతమైన ఆదర్శాలు, పవిత్రమైన కర్తవ్యాలు వున్నాయి. కొన్ని మినహాయింపులతో; మూడో తరగతి నుండి 10వ తరగతి వరకు అందరికీ ఒకే రకమైన విద్య, బోధనా మాధ్యమంగా మాతృభాష, ఆరో తరగతి నుండి కొత్త పాఠాలు – వీటినిండా 21వ శతాబ్దపు నైపుణ్యాలు – సంస్కృతం, పాళీ, ప్రాకృతం భాషల్లో బోధన, విదేశీ భాషలు నేర్చుకోవడం – ఇలా ఎన్నెన్నో దీనిలో వున్నాయి. పాత విద్యా విధానంలో వున్నవాటినే పునరుక్తి తప్ప గత ఏడు దశాబ్దాల నుంచి వాటిని అమలు పరచడంలో విఫలురయ్యారు. ఇప్పుడు కూడా 'ఎక్కడెక్కడ సాధ్యమో' అనే పదబంధం వాడుతూ బోధనా మాధ్యమం మాతృభాషలోనే వుండాలి అనడంతో ఈ విషయంపై వీరి చిత్తశుద్ధి ప్రశ్నార్థకమౌతోంది. ఇప్పుడు బోధనా మాధ్యమంగా ఇంగ్లీషును వాడుతున్నవారు దానిని కొనసాగించుకోడానికి దీని వల్ల అవకాశం లభిస్తోంది.

2020 జాతీయ విద్యావిధానం ఉన్నతవిద్యను ప్రైవేటీకరణ చేసే క్రమాన్ని ప్రత్యేకంగా నొక్కి చెప్పింది. వాటిలో కొన్ని అంశాలు : వివిధ కోర్సులుండే విశ్వవిద్యాలయాలు – ఉన్నత విద్యాసంస్థల గ్రూపులు : 50 వేల కళాశాలలను 15000 కళాశాలలుగా క్రమబద్ధీకరణ పేరుతో తగ్గించడం : 3000 మంది విద్యార్థుల కంటే తక్కువ వున్న కళాశాలలను మూసివేయడం : ఒకే రకమైన సబ్జెక్ట్ బోధిస్తున్న ఐ.ఐ.టి, ఐఐఎమ్, ఐఐఐటి మొదలగు సంస్థలను బహుళ కోర్సుల సంస్థలుగా ఉన్నతీకరించడం : విదేశీ సంస్థలు తమ విద్యాసంస్థలను భారతదేశంలో స్థాపించుకోడానికి అనుమతినీయడం : యు.జి.సి మరియు ఎఐసిటిఇలను ఉన్నత విద్యా క్రమబద్ధీకరణ కౌన్సిల్‌గా రూపొందించి, దానికి అదుపు చేసే అధికారం లేకుండా చేసి, కేవలం అనుమతించే దానిగా మార్చడం.

ఆచరణలో ఉన్నత విద్యకు సంబంధించిన ఈ ప్రతిపాదనలు రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య సాంఘిక, ఆర్థిక అసమానతలను మరింత దిగజారుస్తాయి. 2020 జాతీయ విద్యావిధానం విద్య అనేది ప్రజలకు మంచి చేసేదనీ, దానిలో లాభాలు వెదకటాన్ని అదుపు చేయాలనీ అంగీకరిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఫీజుల విషయంలో క్రమబద్ధీకరణ వుంది. కాని వాటి లాభార్జన మాత్రం తగ్గించడంలో నిస్సహాయులుగా వున్నారు. స్థాయి పెంచిన కళాశాలలకు, సిలబస్ రూపొందించుకోవడంలో, డిగ్రీలు ఇవ్వడంలో స్వాతంత్ర్యం వున్నట్లుగానే – ఫీజులను నిర్ణయించుకోవడంలోనూ స్వేచ్ఛ వుంది. ఉన్నత విద్యాసంస్థల గ్రూపులకూ, విశ్వవిద్యాలయాలకూ అది దానకర్ణుల విరాళాలను అంగీకరిస్తోంది. ఈనాడు భారతదేశంలో అతి తక్కువ పెట్టుబడితో అత్యధికమైన లాభాలు గడించే వ్యాపారంగా విద్య మారిందన్న విషయం అందరికీ తెలిసిన విషయమే.

స్టైఫండ్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు ఇవ్వడంపై రాజీపడేదే లేదనీ, పైపెచ్చు వారికి పౌష్టికాహారమూ, మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయపు అల్పాహారాన్ని కూడా ఇవ్వడానికి 2020 ఎన్ఇపి హామీనిచ్చింది. అత్యాశతో కూడినట్టి ఈ ప్రతిపాదనలన్నీ ఆచరణలో సాధ్యంకానివి. విద్యారంగంలో వ్యయాన్ని జిడిపిలోని 4.45% నుంచి 6%కు పెంచాలని 2020 ఎన్.ఇ.పి. ప్రతిపాదించింది. అంతేకాదు మొత్తం వ్యయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి 10 నుంచి 20 శాతం వరకు పెంచడమే ధ్యేయంగా చెప్పుకుంటుంది. 1950లలోనే ఇటువంటి సూచన సిఫార్సు చేయబడింది. కాని గతంలో ఎన్నడూ అది ఆ స్థాయికి చేరలేదు.

విద్యారంగానికి సంబంధించిన ఈ విధానాన్ని పార్లమెంటులో చర్చించకుండా, కోవిడ్–19 బూచిని ఒక సాకుగా చూపి ప్రభుత్వం అపరాధం చేసింది. ఆ విధంగా రాష్ట్రాలు తమ తమ స్థానిక అవసరాల కనుగుణంగా వారి వారి విద్యావిధానాలను రూపొందించుకునే అవకాశాన్ని మృగ్యం చేసింది. దేశంలో 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వాటి ప్రభుత్వాలు వుండగా, తాము ఆరు దక్షిణాది రాష్ట్రాల, ఒడిస్సా రాష్ట్రపు పార్లమెంటు సభ్యులతో విస్తృతమైన సంప్రదింపులు చేసామని చెప్పడంలో నరేంద్రమోదీ అక్రమ ప్రవర్తన తేటతెల్లమవుతోంది.

అన్ని స్థాయిలలో విచ్చలవిడిగా విద్యారంగాన్ని వ్యాపారమయం చేయడాన్నీ, దొంగచాటుగా పాఠ్య ప్రణాళికలో కలుగచేసుకొని దానికి మత సంబంధమైన విషయాలు అంటించడాన్ని వ్యతిరేకించవలసిందిగానూ, ప్రజాస్వామికమైన, అందరికీ సమానమైన శాస్త్రీయ విద్యావిధానం కొరకు పోరాడవలసిందిగానూ సి.పి.ఐ.(యం–యల్) కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

**విజయవాడ** **విశ్వం**, ప్రధానకార్యదర్శి

**2-8-2020** **సి.పి.ఐ.(ఎం–ఎల్)**

౦౦౦